ప్రజాస్వామ్యానికి పాతర

బీఆర్ఎస్‌వీ నాయకులు అసెంబ్లీని ముట్టడించకుండా పోలీసుల ముందస్తు అరెస్టులు

పరిగి : అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులతో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్

పరిగి, మార్చి 22 : బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులు రవికుమార్, రఘువీర్, హరి, నరేశ్‌లను అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారిని పరిగి మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనలు చేపట్టరాదని సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. శాంతియుతంగా కార్యక్రమానికి పిలుపునిస్తే పోలీసులచే అక్రమంగా అరెస్టు చేయించడం సరికాదన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

తాండూరు : కాంగ్రెస్ అంటేనే మోసపూరితమైన పార్టీ అని తాండూరు బీఆర్ఎస్వీ నేతలు పేర్కొన్నారు. శనివారం బీఆర్ఎస్వీ నేతలు అసెంబ్లీని ముట్టడించకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు బదులుగా నిర్బంధ పాలన చేస్తున్నాడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలకు కాంగ్రెస్ మంగళం

తాండూరు : పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నేతలు

కొడంగల్ : పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

చెప్పిందన్నారు. విద్యాశాఖకు మంత్రిని కూడ చేయలేని కాంగ్రెస్ విద్యావ్యవస్థను ఏవిధంగా ముందుకు తీసుకువెళుతుందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కూడా విద్యకు కేవలం 7 శాతం మాత్రమే నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ గారడీ మాటలతో ప్రజలను మోసం చేసిండన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొట్టాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు భయపడకుండా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నేతలున్నారు.

2లక్షల ఉద్యోగాలని.. 12వేల ఉద్యోగాలే భర్తీ!

బొంరాస్‌పేట్ : బీఆర్ఎస్‌వీ అధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా ఉండేందుకు పోలీసులు బీఆర్ఎస్‌వీ నాయకులు లక్ష్మణ్‌నాయక్, నెహ్రూనాయక్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వాన్ని కొనసాగించలేరని, అడుగడుగునా అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాలని 12వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీచేశారన్నారు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డు, స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు.

ప్రజలకు సేవలందించడం అదృష్టం

శిక్షణ ముగించుకొని వెళ్తున్న ఉమాహారతిని సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- శిక్షణ ముగించుకొని వెళ్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతికి సన్మానం

వికారాబాద్, మార్చి 22 : ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నత స్థానంలో ఉండి ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవలు అందించడం అదృష్టంగా భావించాలని వికారాబాద్ కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఒక ఏడాదిపాటు ట్రైనీ కలెక్టర్‌గా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని వెళుతున్న ఉమాహారతికి శనివారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ కేడర్‌లో మంచి పోస్టింగ్ ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగిగా సర్వీసు చేయడం అదృష్టమన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేసే నిర్ణయాలుండాలని, ప్రభుత్వ ఉద్యోగిగా విధుల్లో చేరినప్పటి నుంచి ఉద్యోగ విరమణ పొందే వరకూ అదే చిరునవ్వుతో పని చేయాలని తెలిపారు. అసోసియేషన్, మీడియా , ఉద్యోగులను కలుపుకొని ఫ్రెండ్లీ పరిపాలన అందించేలా ముందుకు వెళ్లాలని సూచించారు. సర్వీసుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబసభ్యులను చూడాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిగా ఉమాహారతి మంచి సేవలు అందించారన్నారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఉమహారతి మాట్లాడుతూ.. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏ సమస్య రాకుండా శిక్షణ పూర్తి చేసుకున్నానని, కలెక్టర్ ముందు నుంచి నమ్మకంతో పనులు చేయించారన్నారు. దౌల్తాబాద్ ఎంఆర్వోగా మూడు నెలలు, పరిగి ఎంపీడీవోగా ఒక నెల, శిశు సంక్షేమ శాఖ అధికారిగా రెండు నెలలు పూర్తి బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. రెవెన్యూ సర్వీసు నిర్వహించడం మంచి అనుభవం వచ్చిందని తెలిపారు. జిల్లా అధికారులు ఆమెకు అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం ఉన్నారు.

సమావేశానికి హాజరైన అంబేద్కర్, జ్యోతిబాపూలే, పూలే జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు

మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో డాక్టర్ జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకునేందుకు వీలుగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు జగ్జీవన్ రామ్, అంబేద్కర్, జ్యోతిబాపూలే జీవిత చరిత్రలు తెలుసుకునేలా చిత్ర, నాటక ప్రదర్శన ద్వారా తెలిపే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఎస్సీడీడబ్ల్యూవో మల్లేశం, డీఎండబ్ల్యూవో కమలాకర్‌రెడ్డి, డీఐవో శంకర్‌నాయక్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా..

- సీసీలుగా ఇతర జిల్లాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు
- విషయం వెలుగులోకి రావడంతో ఇద్దరు సీసీలు రిలీవ్

ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

ఆమనగల్లు, మార్చి 22 : పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాల్సి అధికారులే నిబంధనలను తుంగలో తొక్కారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను సీసీలుగా నియమించుకున్నారు. ఈ సంఘటన ఆమనగల్లు మండలంలోని పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో జరిగింది. ఈ రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 537 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక సీఎస్(చీఫ్ సూపరింటెండెంట్), ఒక డీఓ(డిపార్ట్‌మెంటల్ అధికారి), ఒక సీసీ(కాన్విడెన్స్ క్లర్కు)లను నియమించింది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఇదే మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను సీసీలుగా నియమించాల్సి ఉంటుంది. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం సీఎస్ శ్రీధర్ తనకు అనుకూలంగా ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్‌గా నియమించిన ఆంజనేయులును సీసీగా నియమించుకున్నారు. అదే విధంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో సీఎస్ ప్రభాకర్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మణిపాల్‌రెడ్డిని సీసీగా నియమించుకున్నారు. రెండు పరీక్షా కేంద్రాలకు చెందిన ఇద్దరు సీఎస్‌లు నిబంధనలకు విరుద్ధంగా నియమించుకున్న సీసీల ద్వారా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ప్రమాదముందని కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం డీఈవో సుశీందర్‌రావుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో విరుద్ధంగా నియమించుకున్న సీసీలకు శుక్రవారం సాయంత్రం రిలీవ్ చేశారు.

ఆమనగల్లు పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాలను శనివారం డీఈవో సుశీందర్‌రావు సందర్శించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిలో సీసీలను ఎలా నియమించుకున్నారని పరీక్ష కేంద్రాల సీఎస్‌లపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై విలేకరులు డీఈవో సుశీందర్‌రావుతో చర్చించగా ఇతర జిల్లాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను సీసీలుగా నియమించరాదని, నిబంధనలకు విరుద్ధంగా ఎలా నియమించారో విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

వికారాబాద్, మార్చి 22 : బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులపై సమీక్ష నిర్వహించి, గతంలో నమోదై పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో బెట్టింగ్, జూదం, ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతాక్రమంలో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు, పిల్లలపై అఘాయిత్యాలు, సైబర్ నేరాలకు సంబంధించి వేగంగా దర్యాప్తు జరిపి న్యాయం కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రమాదాలకు కారణాలు విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎర్రమట్టి ఇసుక, గుట్కా, బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిన సందర్భంలో వెంటనే దాడులు నిర్వహించి, కేసులు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించడానికి, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిట్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిత్యం నిఘా పెట్టి నేరాలను తగ్గించేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. కేసులో నిందితులకు త్వరగా శిక్షలు విధించేందుకు కోర్ట్ మానిటరింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్క ఫంక్షనల్ వర్టికల్ గురించి ఎస్పీ వివరంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు అభినందన

సేవా పతకాలు పొందడం పోలీస్ అధికారుల కృషి, నిబద్ధత, సేవాభావానికి ప్రతీక అని ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో 2024లో సేవా పతకాలు పొందిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందిస్తున్న సేవలు సామాజిక శాంతి, భద్రతకు ఎంతో సహాయపడతాయన్నారు. వారి సేవలు పోలీస్ విభాగానికి గర్వకారణమన్నారు. పతకాలు పొందిన అధికారులను ప్రోత్సహిస్తూ, వారి అనుభవాలను సహచర అధికారులతో పంచుకోవాలని, తద్వారా పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ సేవా పతకాలు వచ్చిన డబ్ల్యూహెచ్‌సీ ఎం.నారాయణమ్మ (ఉత్కృష్ట సేవా పతకం), ఏఆర్‌హెచ్‌సీ పి.హన్మిరెడ్డి (సేవా పతకం), ఏఆర్‌హెచ్‌సి ఎం.శ్రీశైలం (సేవా పతకం), ఎస్ఐ అబ్దుల్ హఫీజ్(ఉత్తమ సేవా పతకం), ఏఎస్ఐ ఎం.రాజశేఖర్ (సేవా పతకం), హెచ్‌సీ బి.మాణయ్య (అతి ఉత్కృష్ట సేవా పతాకం), పీసీహెచ్.శివకుమార్ (ఉత్కృష్ట సేవా పతకం) లకు మెమెంటోలు అందజేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, అడ్మిన్ ఆర్ఐ విజయ్ ఉన్నారు.

సమావేశానికి హాజరైన జిల్లా పోలీసులు

విద్యార్థులకు ప్రోత్సాహం

అంతరిక్షం, స్పేస్ అప్లియన్స్‌పై ఇస్రో అవగాహన టూర్‌కు మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


అంతరిక్షం, స్పేస్ అప్లియన్స్‌పై ఇస్రో అవగాహన టూర్‌కు వెళ్లిన మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 22 : అంతరిక్ష పరిశోధనలపై మక్కువ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రత్యేకంగా తమ ప్రాంగణాలకు ఆహ్వానించి నూతన ఆవిష్కరణలపై ఉత్సాహాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నది. అందులో భాగంగా ఉపగ్రహ ప్రయోగాలను తెలుసుకునేందుకు, శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పాండాల వంశీకృష్ణ, తాళ్ళ తరుణ్‌గౌడ్, పొగాకు యతీన్ శివకుమార్, శ్రీవినీశ్‌గౌడ్, సీహెచ్ ప్రశాంత్, ఎడ్ల త్రినాథ్ విద్యార్థులకు అవకాశం కల్పించింది. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో 100 ప్రయోగాలు పూర్తి చేసుకుందని, అగ్ర దేశాలకు దీటుగా ప్రభాత్ పలు పరిశోధనలు చేపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజెప్పేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో టూర్ నిర్వహించిదన్నారు. ఈ టూర్‌కు మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవకాశం రావడం సంతోషకరమన్నారు. టూర్ ముగించుకొని పాఠశాలకు వచ్చిన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 22 : జిల్లాలో నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ నిచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు ఉపాధి కల్పించేలా అధికారులు కార్యాచరణ అమలు చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శనివారం తన చాంబర్‌లో జిల్లా స్థాయి స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో కలెక్టర్ చైర్మన్‌గా 16 మంది సభ్యులతో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేందుకు అవసరమైన నైపుణ్యత, శిక్షణ అందించేందుకు జిల్లాస్థాయి కమిటీ పనిచేస్తుందన్నారు. జిల్లాలో ప్రజలు సర్వీసు, సెక్టార్‌లలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చిన్న పరిశ్రమల స్థాపన, స్టార్టప్ కల్చర్, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలను జిల్లా స్థాయి స్కిల్ కమిటీ ద్వారా చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించేలా యువతను తయారు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగం, ఆర్మీ, బ్యాంక్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యువతకు తెలియజేస్తూ వారు ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన శిక్షణ అందించేందుకు కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. పెద్ద కంపెనీలు ప్రస్తుత డిమాండ్ ప్రకారం యువతలో నైపుణ్యత ఉండేలా చూడాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యరశ్మి యోజన పథకం, స్వశక్తి మహిళా సంఘాలు, మెప్మా సంఘాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, వీరికి అవసరమైన శిక్షణ నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్, ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ అధికారి కమాలాకర్‌రెడ్డి, స్పోర్ట్స్ అధికారి హనుమంతరావు, సంబంధిత అధికారులున్నారు.

కూరగాయల సాగును పెంపొందించాలి

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సురేశ్

గడ్డమల్లయ్యగూడలో మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సురేశ్

యాచారం, మార్చి 22 : కూరగాయల సాగును పెంపొందించేందుకు రైతులు అన్ని విధాలుగా కృషి చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల అధికారి సురేశ్ అన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఆదేశాల మేరకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్ల తోటలు, ఆకుకూరల సాగు కోసం అందించే సబ్సిడీల కోసం రైతుల నుంచి శనివారం దరఖాస్తులు స్వీకరించారు. చౌదర్‌పల్లిలో రైతు వేదిక భవనంలో, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రైతుల నుంచి నేరుగా దరఖాస్తులను తీసుకున్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి గ్రామాల్లో 212 మంది రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల రైతులకు సబ్సిడీ కింద డ్రిప్స్, స్ప్రింక్లర్లు, పీవీసీ పైపులు, పట్టు పురుగుల పెంపకం, సోలార్ ఫెన్సింగ్, వ్యవసాయ యంత్రాలు, బ్యాటరీ, పవర్ పంపులు, కూరగాయల విత్తనాలు, నారు తదితర వాటిని రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, అధికారులున్నారు.



తాగునీటిని వృథా చేస్తే 10 వేల ఫైన్

బంజారాహిల్స్ : ఇష్టారాజ్యంగా నీటిని వృథా చేసేవారిని, మంచినీటితో వాహనాలను కడిగే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధించాలని జలమండలి అధికారులను మేయర్ ఆదేశించారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీవాసుల సమావేశంలో మేయర్ పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటడంతో నగరవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో జలమండలి నీటిపైనే ఆధారపడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కొందరు అవసరం ఉన్నా.. లేకపోయినా చీటికిమాటికీ వాహనాలు కడుగుతూ, పైపుల ద్వారా ఇంటి ముందు నీళ్లను వృథా చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై జల మండలి అధికారులు కఠినంగా ఉండాల్సిందేనని, వారిని గుర్తించి రూ.10 వేల జరిమానా కూడా విధించాలని ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కకుండా..

- ముందస్తు సమాచారంతో మందుబాబులు తప్పించుకునే ప్రయత్నాలు
- రోజుకు సగటున 170 కేసులు
- యువతే ఎక్కువ

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపేవారికి చెక్ పెట్టడానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 21 వరకు 4865 కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. పోలీసుల చేతికి చిక్కిన మందుబాబుల్లో 2వేల మంది 21-30 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారే కావడం గమనార్హం. మరోవైపు పోలీసులు తాము అనుకున్న స్థాయిలో టార్గెట్ రీచ్ కాలేకపోయామని అంతర్గతంగా చర్చిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందుకుకారణం మందుబాబులు తనిఖీల నుంచి తప్పించుకోవడంలో ఆరితేరిపోయారని పోలీసులే చెబుతున్నారు.

మందుబాబుల ప్రయత్నాలు..

డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్స్‌లో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు మందుబాబులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట్లో తాము ప్రయాణించేదారిలో ఎక్కడైనా డ్రంక్ అండ్ డ్రైవ్ ఉందంటే వాహనాలు వెనక్కి తిప్పి జారుకునేవారు. అయితే పోలీసులు అటువంటి అవకాశం లేకుండా మూడు వైపులా దారి లేకుండా నాలుగో వైపు తాము ఉండి చెకింగ్స్ చేస్తుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతికారు. ఇందులో వాట్సాప్ గ్రూప్స్ ఎక్కువగా పనిచేశాయి. అప్పట్లో హైదరాబాద్ సిటీలో ఏరియాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఎక్కడెక్కడ చెకింగ్స్ అవుతున్నాయో పోస్ట్ చేసేవారు. గ్రూప్ సభ్యులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండడంతో దాదాపు అన్ని ఏరియాలకు సంబంధించిన సమాచారం గ్రూపులో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నదని ఓ అధికారి చెప్పారు.

ఒక్కో పీఎస్‌కు ఐదు చోట్ల మాత్రమే చెకింగ్..

ట్రాఫిక్ పోలీసులు చేస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో మందు తాగి వాహనాలు నడిపేవారిని పట్టుకోవడానికి అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాము వాహనాలు ఆపే సమయంలో తప్పించుకోవడానికి ప్రయత్నించేవారికి కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా, తమకు కూడా మందుబాబులతో ఎలాంటి సమస్య తలెత్తకుండా చెకింగ్ పాయింట్స్‌ను ముందుగానే పరిశీలించి ఎంపిక చేసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఏరియాలు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో పీఎస్‌కు ఐదు చొప్పున ఉన్నాయని వారు చెప్పారు. కాగా, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మొదలుకాగానే మందుబాబులు ఎవరికీ వారు మెసెజ్ చేసుకోవడంతో చాలామంది ఈ తనిఖీల నుంచి తప్పించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ పరిస్థితికి చెక్ పెట్టడానికి ఆకస్మిక తనిఖీలు చేపట్టడానికి కావాల్సిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పట్టభద్రుల విద్య సమాజ అభివృద్ధికి కీలక సాధనం

అస్సాం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణమూర్తి

మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

మొయినాబాద్, మార్చి 22 : పట్టభద్రుల విద్య సమాజ అభివృద్ధికి కీలక సాధనమని.. విద్యార్థులు చేసే పరిశోధనలు దేశ భవిష్యత్తుకు దోహదపడాలని అస్సాం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణమూర్తి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ 13వ పట్టభద్రుల వేడ